క్లుప్తంగా

జాతీయ సమైక్యతను కొనసాగిద్దాం


మట్టిని సేకరిస్తున్న ఉపాధ్యాయులు

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రతి ఒక్కరూ జాతీయ సమైక్యతకు పెద్దపీట వేయాలని ముద్దాడ బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల హెచ్ఎం తమ్మినేని నారాయణరావు అన్నారు. జాతీయ స్వాతంత్ర్య అమృత మహోత్సవంలో భాగంగా పాఠశాలలో మేరా మట్–మేరా దేశ్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మట్టిని సేకరించారు. ఉపాధ్యాయులు కోటిపాత్రుని కొండయ్య, బి.భవాని తదితరులు పాల్గొన్నారు.

జల్ జీవన్ మిషన్ పనులు పరిశీలన


పెంట గ్రామంలో పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న ఏఈఈ భాగ్యలక్ష్మి

జి.సిగడాం: మండలం పరిధిలో పెంట గ్రామంలో చేపడుతున్న జల్ జీవన్ మిషన్ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ బగాది భాగ్యలక్ష్మి గురువారం పరిశీలించారు. ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయడంతో తాగు నీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు పైపు లైన్ పనులు చేస్తున్నామన్నారు. సర్పంచ్ పున్నాన సోనియా, వైఎస్సార్‌సీపీ నాయకులు పున్నాన అక్కలనాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం


పౌష్టికాహారాన్ని ప్రదర్శిస్తున్న దృశ్యం

లావేరు: చిరుధాన్యాల్లో ఎన్నో పోషక విలువలు ఉన్నాయని రణస్థలం ఐసీడీఎస్ ప్రాజెక్టు పీఓ సీహెచ్ ఝాన్సీరాం అన్నారు. మండలంలోని మురపాక సెక్టార్ పరిధిలోని పీబీనగర్ కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. చిరుధాన్యాలతో ఆరోగ్య సంపద అనే అంశంపై అవగాహన సమావేశం నిర్వహించారు. పౌష్టికాహారాలను ప్రదర్శించారు. పీఓ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలను ప్రతిరోజూ ఆహారంలో తీసుకోవాలన్నారు. సెక్టార్ సూపర్‌వైజరు సుష్మిత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంజీవరాయ ఆలయానికి విరాళం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బొందిలీపురంలో బాయమ్మతోట వద్ద సంజీవరాయ ఆలయ జీర్ణోద్ధారణకు నైర వ్యవసాయ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ ఆరికతోట కనకరాజు, ఉమ దంపతులు రూ.5వేలు విరాళం అందించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కాశిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రూప్స్ విజేతకు సన్మానం


సువర్ణను సత్కరిస్తున్న దిశా డీఎస్పీ వాసుదేవరావు

శ్రీకాకుళం క్రైమ్ : గ్రూప్–1లో డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన పరపటి సువర్ణను శ్రీకాకుళం దిశా డీఎస్పీ ఎస్.వాసుదేవరావు తన కార్యాలయంలో సన్మానించారు. డీఎస్పీ వాసుదేవ్ (సుగ్గువానిపేట), సువర్ణ (ఆకాశ లక్కవరం) లు జిల్లాలో సంతబొమ్మాళి మండలం ఆకాశ లక్కవరం పంచాయతీకి చెందినవారు కావడం విశేషం. పక్క పక్క గ్రామాలే కావడంతో డీఎస్పీని సువర్ణ, తల్లిదండ్రులు ధర్మారావు, చంద్రకళలు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో దిశా ఎస్ఐ చంద్రకళ, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అరసవల్లి: శ్రీకాకుళం–ఆమదాలవలస ప్రధాన రహదారి విస్తరణ పనుల నేపథ్యంలో రాగోలు పరిసర ప్రాంతాలకు ఈ నెల 30న ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎస్.బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. రాగోలు, రావిపాడు, గూడెం, లంకాం, కొత్త రోడ్డు, తోటాడ, అక్కివరం, చంద్రయ్యపేట తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


శ్రీకాకుళం కల్చరల్:ఆకట్టుకున్న చిన్నారుల నృత్యాలు


పొందరవీధిలో సామూహిక పుజలు


శ్రీకాకుళం కల్చరల్: రైతుబజారు వద్ద వినాయకున్ని దర్శించుకుంటున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు


రణస్థలం: కంబాలపేటలో వినాయక విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు


ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలో అన్నసమరాధన

శ్రీకాకుళం కల్చరల్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఒత్తిళ్లతో ప్రజలు మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆధ్యాత్మిక భావన కలిగి ఉండటం ద్వారా మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని రైతు బజారు కూడలి వద్ద హారిక కన్‌స్ట్రక్షన్స్ అధినేత హారికా ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని మంత్రి ధర్మాన గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ధర్మానకు వినాయక చిత్రపటాన్ని అందజేసి శాలువతో సత్కరించారు. అనంతరం నిర్వహించిన చిన్నారుల నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, మండవిల్లి రవి, వి.జగన్నాథం నాయుడు, ఇలిసిపురం మెగా యూత్ సభ్యులు అప్పి, వాసు తదితరులు పాల్గొన్నారు.

● బలగ పొందరవీధిలో వినాయక మండపం వద్ద సామూహిక కుంకుమ పుజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రిమ్స్ రహదారిలో మండపం వద్ద అన్నదాన కార్యక్రమం జరిగింది. మొండేటివీధి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

అన్నసమారాధన..

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామాల్లో గణపతి నవరాత్రుల వేడుకల్లో భాగంగా ఊరేగింపు, గణేష్ నిమజ్జన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గురువారం కుశాలపురం, ఎచ్చెర్లలో అన్నసమరాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఫరీదుపేటలో ఘననాథుడిని ఊరేగించారు.

చినమురపాకలో..

లావేరు: మండలంలోని చినమురపాకలో గణపతి ఉత్సవాలు సందర్భంగా గురువారం అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రణస్థలం మండలంలో..

రణస్థలం: మండలంలో గణపతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కంబాలపేట, కోష్ట, కొవ్వాడ, జే.ఆర్.పురం వెంకటేశ్వర కాలనీలో అన్నసమారాధనలు నిర్వహించారు. పలుచోట్ల గణపతి విగ్రహాలను నిమజ్జనం చేశారు.

మార్మోగిన సాయినామం


లావేరు: కేశవరాయునిపాలెంలో సామూహిక సత్యసాయి వ్రతాలు


జి.సిగడాం: ఆనందపురంలో బాబా విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు


ఎచ్చెర్ల: బాబాకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జి.సిగడాం: మండలంలోని ఆనందపురం గ్రామంలో షిర్డీ సాయి బాబా జన్మదినం వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. సాయి నామంతో ఆనందపురం హోరెత్తింది. సుమారుగా 5 వేల మంది భక్తులు హాజరయ్యారు. పూజ్య గురువులు అమ్ముల సాంబశివరావు ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఆలయ నిర్మాత మక్క వెంకట సాయి సమక్షంలో బాబాను ఊరేగించారు. అనంతరం భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. రణస్థలం, లావేరు, జి.సిగడాం, చీపురుపల్లి, రాజాం, పొందూరు, ఎచ్చెర్ల మండలాలకు చెందిన సాయి భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి వ్రతాలు

లావేరు: మండలంలోని కేశవరాయునిపాలెంలో గల షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం బాబా జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు, సామూహిక సత్యసాయివ్రతాలు చేపట్టారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. సహస్ర దీపారాధన, కేక్ కటింగ్, బాబా ప్రార్థనలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాబాకు ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల: మండలంలోని ఎస్ఎస్ఆర్‌పురం గ్రామంలోని బాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. సాయిబాబా విగ్రహాన్ని ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి బాబాను దర్శించుకున్నారు.

ఆదాయ వ్యయాల లెక్కలు తేల్చండి


సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు బాప్టిస్టు చర్చి ఆదాయ, వ్యయాలకు లెక్కలు చెప్పాలని పలువురు చర్చి సభ్యులు, నాయకులు డిమాండ్ చేశారు. చిన్నబజారులోని తెలుగు బాప్టిస్టు చర్చిలో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత కమిటీ గత 23 ఏళ్లుగా కొనసాగుతోందని, ఎటువంటి ఎన్నికలు పెట్టకుండా తాత్సారం చేస్తోందని చెప్పారు. కొన్నాళ్లుగా ఆదాయ వ్యయ లెక్కలు చెప్పడం లేదని, ఆడిట్ చేయించడం లేదని, సంఘ అభిమానులు ఇచ్చిన విరాళాలను బ్యాంకులో జమ చేయకుండా ఒక సభ్యుని వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు పెద్దమొత్తంలో బదిలీ చేశారని, పాలకవర్గ తీర్మానాలు లేకుండా నిధులు ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల లెక్కలు అడిగినందుకు కొందరు మహిళలపై దౌర్జన్యం చేశారని మండిపడ్డారు. సమావేశంలో సంఘ అధ్యక్షుడు ఎం.ఎ.రత్నకుమార్, డి.ప్రసాదరావు, బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఈ నెల 30 నుంచి ప్రారంభం కానుంది. సింగుపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో రెండు బృందాలు ఆరోగ్య పరీక్షలు చేస్తాయని శ్రీకాకుళం ఎంపీడీఓ రామ్మోహన్ గురువారం తెలిపారు. 30న పొన్నాం, అక్టోబర్ 3న వప్పంగి, 4న రాగోలు, 5న కనుగులవానిపేట, 6న సింగుపురం, 7న ఎస్ఎస్‌వలస, 9న భైరి, 10న ఇప్పిలి, 11న కిష్టప్పపేట, 12న పీజీపేట, 13న అలికాం, 16న సానివాడ, 17న నైరా, 18న కరజాడ, 19న లంకాం, 20న గూడెం, 21న బావాజీపేట, 25న తండేవలస, 27న కళ్లేపల్లిలో శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బీజేపీ బలోపేతమే లక్ష్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో భారతీయ జనతా పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంపతరావు నాగేశ్వరరావు అన్నారు. ఎచ్చెర్లలో గురువారం పోలింగ్ కేంద్రాలపై సమీక్ష నిర్వహించారు. శుక్ర, శనివారాల్లో అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తామన్నారు. గ్రామ, పోలింగ్ స్టేషన్ల వారీగా పార్టీని బలోపేతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తమ్మినేని గోవిందరావు, వావిలపల్లి చందరరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


మంత్రి మేరుగ నాగార్జునను కలిసిన ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు రుషి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జిల్లాలో దళితుల సమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు పొన్నాడ రుషి కోరారు. ఈ మేరకు గురువారం అమరావతిలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునను కలిసి వినతిపత్రం అందించారు. జిల్లా, మండల, పట్టణ పార్టీ అనుబంధ విభాగం కమిటీలు వేయాలని కోరారు. వైఎస్సార్ సీపీలో ఎస్సీ విభాగాల నాయకులతో సమావేశం ఏర్పాటుచేసి ప్రధాన సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చొరవ చూపాలని విన్నవించారు.

ఇదెక్కడి సమస్య?


అంబేడ్కర్ జంక్షన్‌లో రోడ్డుపై ఉన్న మురుగునీరు


డేఅండ్‌నైట్ జంక్షన్‌లో రోడ్డుపైకే మోటార్ ద్వారా మురుగునీటిని తోడుతున్న దృశ్యం

శ్రీకాకుళం: నగరంలోని అంబేడ్కర్ జంక్షన్‌లో వారం రోజులుగా మురుగునీటి దుర్గంధంతో అక్కడి వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడుతుండగా మున్సిపల్ యంత్రాంగం మరో కొత్త సమస్య తెచ్చిపెట్టింది. అంబేడ్కర్ జంక్షన్ పరిసర ప్రాంతవాసులు ఆ దుర్గంధం విషయాన్ని మున్సిపల్ అధికారుల దృష్టికి రెండు రోజుల క్రితం తీసుకువెళ్లారు. అక్కడ ఉన్న మురుగుకాలువలు నిండిపోయి వర్షం నీటితో కలిసి రోడ్లపైకి వస్తుందని గుర్తించి ఓ ఇంజన్‌తో కాలువల్లో నీటిని బుధ, గురువారాల్లో తోడించారు. ఆ నీటిని మరోచోట మురుగుకాలువల్లోకి వెళ్లేలా చేయకుండా పైపులను డేఅండ్‌నైట్ జంక్షన్ వరకు తీసుకువచ్చి రోడ్డుపై ప్రవహించేలా చేశారు. దీంతో డేఅండ్‌నైట్ జంక్షన్, అటవీశాఖ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో మురుగునీరు రోడ్లపై నిలిచి దుర్గంధంతో నిండిపోయింది. ఇప్పటికైనా నగర పాలక సంస్థ అధికారులు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

టేకు కలప సీజ్

కొత్తూరు: మండలంలోని గొట్టిపల్లి సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన టేకు కలపను సిబ్బందితో కలిసి పట్టుకున్నట్లు సారవకోట ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఈశ్వరరావు గురువారం తెలిపారు. పట్టుకున్న కలపను సీజ్ చేశామన్నారు. కలప విలువ నిర్ధారించిన తరువాత కేసు నమోదు చేస్తామన్నారు.

ఫ్రీజర్ వితరణ


కొత్తూరు సామాజిక ఆస్పత్రిలో ఉంచిన ఫ్రీజర్

కొత్తూరు: మండలంలోని కుంటిభద్ర గ్రామం కేంద్రంగా పనిచేస్తున్న శ్రీభగత్ సింగ్ ట్రస్టుకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా యూనిట్ ప్రతినిధులు గురువారం ఫ్రీజర్‌ను గురువారం అందజేశారు. భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఫ్రీజర్‌ను ట్రస్టు అధ్యక్షుడు నడిమింటి జగదీశ్వరరావుకు అందించారు. బాక్స్‌ను కొత్తూరు ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో అందుబాటులో ఉంచుతున్నట్లు జగదీశ్వరరావు తెలిపారు. రవాణా ఖర్చులు చెల్లించి తీసుకువెళ్లొచ్చన్నారు. బాక్స్‌కు ఎటువంటి అద్దె చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఎవరికైనా అవసరం ఉంటే ట్రస్టు ఫోన్ 8106419489 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఉత్సాహంగా సాఫ్ట్‌టెన్నిస్ ఎంపిక పోటీలు


జిల్లాస్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు

పాతపట్నం: జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌టెన్నిస్ ఎంపిక పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. పాతపట్నం మార్కెట్ యార్డు ఆవరణలో విద్యార్థులకు క్రీడల ఎంపికలు జరిగాయి. బాలురు, బాలికల అండర్ 14, అండర్ 17 విభాగాల్లో క్రీడా పోటీలు జరిగాయి. జిల్లా స్థాయి క్రీడల్లో పాల్గొని ప్రతిభ కనబర్చనున్నారని పీడీ వై.శేఖర్‌బాబు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జి.అప్పన్న, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బూర్జ: మండలంలోని గుత్తావల్లి గ్రామంలో ఆమదాలవలస బ్రాంచ్ కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు డిలీప్ కృష్ణ, కోటి, వైద్య సిబ్బంది పాల్గొని 150 మందికి తనిఖీలు నిర్వహించి మందులు అందజేశారు. మార్కెటింగ్ మేనేజరు లక్ష్మీప్రసన్న, ఏరియా మేనేజర్ వై.శ్రీనివాస్, సంతకవిటి బ్రాంచ్ మేనేజర్, సిబ్బంది, గ్రామస్తులు బొడ్డేపల్లి నాగరాజు, హెచ్.గోవిందరాజు, ఎస్.తవిటినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు భగత్‌సింగ్


భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఉజ్వల్, కమిటీ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: భారత స్వాతంత్ర్య పోరాటంలో ఉవ్వెత్తున ఎగిసిన పోరాటాల సూరీడుగా భగత్‌సింగ్ నిలుస్తారని గాంధీ మందిర కమిటీ వక్తలు పేర్కొన్నారు. భగత్‌సింగ్ 116వ జయంతి సందర్భంగా శ్రీకాకుళంలోని గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతి వనంలో ఆయన విగ్రహం వద్ద గురువారం నివాళులర్పించారు. కార్యక్రమంలో విగ్రహదాతలు నేమాని వేదవతి, దేవీ శ్యామ్ ప్రసాద్, ఎన్‌వైకె కో–ఆర్డినేటర్ కె.ఉజ్వల్, అవధాన పండితులు పైడి హరనాథరావు, కమిటీ ప్రతినిధులు వావిలపల్లి జగన్నాథంనాయుడు, ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, డాక్టర్ బాడాన దేవభూషణ్‌రావు, పందిరి అప్పారావు, మెట్ట అనంతభట్లు, నక్క శంకరరావు, పొన్నాడ రవికుమార్, శ్రీనివాసరావు, కొమ్ము రమణమూర్తి, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అగ్నివీరులుగా 82 మంది ఎంపిక

శ్రీకాకుళం అర్బన్: జిల్లా యువతకు అన్ని విధాలా శిక్షణ అందించి వారిని ఇండియన్ ఆర్మీ సైనికులుగా, ఆఫీసర్స్‌గా అందించడమే ధ్యేయమని ఇండియన్ ఆర్మీ కాలింగ్ డైరక్టర్ బి.వి.రమణ అన్నారు. శ్రీకాకుళంలోని బ్యాంకర్స్ కాలనీలోని ఇండియన్ ఆర్మీ కాలింగ్ సెంటర్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాజాగా విడుదలైన అగ్నిపథ్ రిక్రూట్‌మెంట్ ఫలితాల్లో ఆర్మీ కాలింగ్ సెంటర్ నుంచి 82 మంది అగ్నివీరులు ఎంపికయ్యారని తెలిపారు. సమావేశంలో రిటైర్డ్ హవల్దార్ నాయక్ సుబేదార్, విశ్వనాథన్ కొల్లి, హవల్దార్ దుంగ వాసుదేవరావు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో చదువుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు జి.ఈశ్వరరావు, కె.రామకృష్ణ, ఎం.సాయి కుమార్ ఆర్మీ అగ్నిపథ్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ, ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ డాక్టర్ వై.పోలినాయుడు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ హరిత, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ తదతరులు గురువారం అభినందించారు.

ఫైర్ ఎన్‌ఓసీ మినహాయింపునివ్వాలని వినతి


ఫైర్ డైరెక్టర్ జనరల్‌ను కలిసిన సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): డెంటల్ క్లినిక్స్ ఏర్పాటుచేసుకునేందుకు ఫైర్ ప్రొటెక్షన్ ఎన్ఓసీ నుంచి మినహాయింపునివ్వాలని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గురువారం విశాఖపట్నంలో రాష్ట్ర ఫైర్‌సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ పి.వి.సునీల్‌కుమార్‌ను ఇండియన్ డెంటల్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు డాక్టర్ డి.రాంబాబు, అజయ్‌బెనర్జి, డాక్టర్ ఊడి సంతోష్‌లు కలిసి వినతిపత్రం అందజేశారు. 15 మీటర్ల లోపల ఉండే భవనాల్లో ఏర్పాటు చేసుకుంటున్న డెంటల్ క్లినిక్‌లకు ఫైర్ ఎన్ఓసీ కష్టతరమైందని పేర్కొన్నారు. కేవలం ఓపీ విభాగమే తప్ప అంతకుమించి ఎటువంటి ప్రమాదకరమైన పరికరాలు ఉండవని, కావున మినహాయింపు ఇవ్వాలని కోరారు.